# చిరుగుగౌను

నేను నర్సాపురంలో ఒక యూరోపియన్ సార్జెంట్ బంగళా పక్కన కాపరమున్నాను. అతనికి నలుగురు కొడుకులూ, కూతుళ్ళూ వాళ్ళందర్నీ కన్నతల్లి వాళ్ళందరికన్నా చిన్నగా కనపడుతుంది. ఆమె శరీరం ఒక్కరవ్వ నలగలేదు. ప్రతిరాత్రీ ఆ సార్జెంటు తాగివొచ్చి, యీ భార్యనీ పిల్లల్నీ, ఇంటినీ, సామానుల్నూ ఒక్కవూపు వూగించి, చీదర వొదలకొట్టేవాడు. మా పిల్లలకీ, వాళ్ళ పిల్లలకీ అయిన స్నేహం ద్వారా, నాకూ పెద్దవాళ్ళకీ స్నేహమయింది. నాలుగు ఆదివారాలు అతనితో 'టీ' తీసుకున్న తరువాత శనివారాలు ఆమెతో వొంటరిగా తీసుకున్నాను. కొత్త సంవత్సరం మొదలు పెట్టగానే పిల్లల్నందర్నీ 'బోర్డింగు'కి పంపారు. ఆమె కింటిదగ్గర యేమీ తోచటంలేదు.

ఆ మధ్యాహ్నం చిరిగిన గౌను వేసుకుని వుంది. అందులో అది యిబ్బందైనచోట చిరిగింది. సర్దుకుందిగాని, లేచినప్పుడల్లా అది కనపడుతోంది, వొద్దన్నా నా దృష్టి అక్కడికే ఆకర్షింపబడుతోంది. కలవరపడే ఆమె వక్షమూ, చలించే ఆమె కళ్ళూ చూస్తే, ఏదో నాతో మాట్లాడతలుచుకున్నట్లు తెలుస్తోంది. 'టీ? కప్పులో పోస్తో, ఆ టీ ధార వంకే నిదానంగా చూసి, నిట్టూర్పు విడిచి, తలొంచుకుని కొంచెంసేపు కూచుని, చప్పున తలెత్తి.

"ఆ చిరుగునేనా చూస్తున్నారు?" అంది.

నిజంగా ఏం చూస్తున్నానో, ఏం చూడాలని నా కళ్ళు అభిలషిస్తున్నాయో ఆమెతో చెప్పే ధైర్యంలేక వూరుకున్నాను. "డిట్సు" లాంతరు ప్రకటన బొమ్మ నాముందు గాలిలో వూగుతూ నవ్వుతోంది.

బైట కోళ్ళూ, ఉడతలూ చప్పుడు చేస్తున్నాయి. "టీ" కప్పుల్లోంచి పొగలేచి పైకి కటికీలవేపు సోమరిగా పాకుతోంది. అంతా శాంతంగా, చల్లగా వుంది.

"పంతులుగారూ, మీకేం తెలుస్తాయి నేను పడే కష్టాలూ! మీతో మాట్లాడుతోవుంటే, మీ రేమనుకుంటారు? 'దీనికేం? రాణి' అనుకుంటారు-కాని....."

కంఠం తగ్గించి ఏమిటో అంది: నేను చెవి వొగ్గాను. తన కుర్చీని నా పక్కగా లాక్కుని.

"రాత్రి పదింటికి రండి....(ఆ చెప్పినవిధం చూస్తే, అదేదో సంకేతకాలం చెప్పినట్టుగా వుంది.) తెలుస్తుంది నా సౌఖ్యం" అంది.

అప్పటికి ఆ మాటల్ని వేరువిధంగా అర్థం చేసుకునే ఆశ వదలక కొట్టుకుంటున్నాయి నా గుండెలు.

"అంత జీతమూ అట్లా పోతుంది. పిల్లలూ, నేనూ ఎట్లా బతకడం? నేను అల్లి, నా నగలమ్మి ఆ డబ్బుతో వాళ్ళకీ, ఆయనకీ బట్టలు కుట్టిస్తాను. నే నిట్లాంటి చిరుగు,

బట్టలు వేసుకుంటా. నే నెట్లావుంటే ఎవరికేం? చూడండి యీ చిరుగు. రాత్రి చింపాడు. చూడండి యెంత చిరుగో. ఎట్లా దాచను? మాసికవేస్తే అంతకన్నా దృష్టి నాకర్షిస్తోంది. ఇందాకణ్నించి మీరు ఇక్కడే చూస్తున్నారు, లేదనకండి. నేనేమీ తప్పనడం లేదు. మీరూ నా స్థితిచూచి జాలిపడ్డట్టున్నారు. కాని ఎవరేం సహాయం చేయగలరు? నా గతి!" అని,

బల్లమీద వున్న చేతులమీద తల నానించుకుంది. వొదులుగా పిన్నులు గుచ్చిన పల్చని జుట్టు బల్లమీద నా చేతులమీద మెత్తగా పడ్డది.

వొంచి సాగిన మెడ మెత్తని నునుపు నా మనసుని పులకించింది. ఆ జుట్టువేపు తల వొంచిన నాకు 'లవండరు' వాసన వేసింది. నావంక ఎవరూ చూట్టంలేదుకదా!

కన్నీళ్ళతో తల పైకెత్తింది.

"ఇంక దేనికోసం బతికేది! ప్రేమా, సంతోషమా? నేను కావలసినవాళ్ళు వున్నారా. 'అయ్యో, బట్టలు చిరిగాయే?" అని ప్రేమతోచూసి పలకరించేవాళ్ళు వున్నారా? కొత్తబట్ట లేసుకుంటే నా చేతుల్నీ, నా మెడ అందాన్నీ చూసి సంతోషించేవాళ్ళున్నారా? యీ అడవినికాసిన వెన్నెలవల్ల లాభమేమిటి? నా హృదయం ఎంత మార్దవమయిందో? నాలో ఎంత ప్రేమా-విశ్వాసమూ-వున్నాయో ఎవరికి తెలుసు? ఎవర్ని నమ్మితే ఏం ఘాతుకం చేస్తారో అని భయం. స్నేహితులతో కూడ స్వేచ్ఛగా వుండను. యింక ఎటువొచ్చీ నామీద దయదలిచి వొచ్చి మాట్లాడేవారు మీ రొక్కరే! మొగుడు కొట్టే ముండ మొహం ఎవరు చూస్తారు? ఎప్పుడు మీరు-"

"నే నెన్నడూ నిన్ను వొదలను. ఇది ప్రమాణం" అన్నాను ధీరంగా! కాని ఆమెని తాకే ధైర్యం రాలేదు యింకా.

"మీ మాటలు నమ్మనా?"

"తప్పకుండా."

"అందరు మొగవాళ్ళ వలె మోసం చెయ్యరు కద!"

"ఎన్నడూ!"

"మీరు విశ్వాసం కలవారే!"

"చాలా"

"మీ భార్యయెడలా?"

"ఆఁ"

"ఐతే, అంతప్రేమా ఆమె మీదనే వుంటే, యింక తక్కినవారి మీద ఏం విశ్వాసం వుంటుందిలెండి?"

"వుంటుంది."

"అబద్ధం" అని.

కుర్చీలోంచి లేస్తోంది. ఇదేమిటి ఇట్లా చెడగొట్టుకున్నాను వ్యవహారం! ఈ తెల్లవాళ్ళతో యిదే గోల!

"లేదు, లేదు, ఈమెమీద పూర్వం ప్రేమ వుండేది. ఇప్పుడంతా ఏదో సంసార పక్షమే గానీ...."

"ఏమీ ప్రేమ లేదన్నమాటే!"

"ఆ, ఏమీ లేదు."

"అంత చంచలమైతే మీ మనసు ఇక మిమ్మల్ని నమ్మినవాళ్ళు నట్టేట్లో దిగవలసిందే! మంచివారే! ఏమో ననుకున్నాను."

కళ్ళనిండా నీళ్ళు కమ్మాయి; కుర్చీలోంచి లేచింది పూర్తిగా. ఏం చెప్పను? ఏదో గొణిగాను. భార్య ఏదో పూర్వోత్తరపు మనిషి అనీ, ప్రేమ అంటే అర్థంగాని పశువు అనీ.....

"ఆమెకేం? చీరెలు, నగలు. మీవంటి దయగల పురుషుడు!" అని వోరగా చూసింది నా చేతులు లేవబోయినాయి. కాని అప్పటికీ తనని సరిగా అర్థంచేసుకోలేదని పెట్టేస్తే?

"నా ఖర్మమే యిట్లా రాసింది. ఇంత విశ్వాసమూ సత్యమూ వుండే భర్తేవుంటేనా!" కన్నీళ్ళతో తడిసిన చంపని నా బుజాని కానించింది. అప్పటికి నాకు ధైర్యం కుదుటపడ్డది.

"మీకు తెల్లగావుంటే యిష్టమా, నల్లగావుంటేనా?"

"ఎంత తెల్లగా వుంటే అంత మరీ యిష్టం."

ముఖమెత్తి వోదార్చ మన్నట్టు నాకేసి చూసింది. తెల్లవాళ్ళకి, నల్లవాళ్ళకీ, సగం తెల్ల వాళ్ళకీకూడా ఆ చిహ్నాలు వొకటే.

మర్నాడే ఆ గౌను చాకలవాడిదగ్గిరికి వెళ్ళింది. మా స్నేహమూ దాంతో వుతుక్కి వెళ్ళినట్టుంది.

గౌను మళ్ళీ తిరిగివచ్చిననాటి రాత్రి, వెన్నెల్లో బంగళాకి వెళ్ళాను. తోవలో 'లైన్స్' దగ్గిర్నించి పది కొట్టడం వినపడ్డది.

"రాత్రి పన్నెండయినా ఇంటికి చేరుకోరుకద! అట్లా వొంటరిగా గేటుకేసి గుడ్లుపెట్టుకు కూచుంటాను." అంది మధ్యాహ్నం; నాగుండె కరిగిపొయ్యేట్టు.

పాపం అట్లానే కూచునివుంది. ఇద్దరం నైట్‌క్వీన్ వెనక కూచున్నాము, వరండాలో. వెన్నెట్లో ఆ తెల్లటిగౌను చిరుగు ఉతుకువల్ల పెద్దదయిందో ఏమో తెలీటంలేదు. సార్జంటు వొచ్చేప్పటికి ఆమె తన సొదని వెళ్ళబుచ్చుకుంటోంది. కంఠం వొణుకుతప్ప, ఆ దీనచరిత్ర ఆమె కళ్ళనెట్లా మారుస్తోందో నాకు కనపట్టంలేదు.

"మొదట్లో ఎంత ప్రేమగా వుండేవారు. 'లూసి, లూసీ, నువ్వే నా సంతోషం! నువ్వే నా వెలుగు!' అనేవారు. ఎప్పుడూ నా వీపు వెనకనే, నా అడుగుల్లో అడుగులేస్తో తిరిగే వారు-వంటింటో.....చివరికి(సిగ్గుతో) స్నానాల గదిలో....

కాని కొద్దిరోజుల్లో అంతాముగిసిపోయింది. నాకన్న ఆ 'బుడ్డీ'ని చూస్తే ఎక్కువ సంతోషం, ప్రేమా! అంతా....నాకేమనిపిస్తుందంటే....మొదటినించీ అంతేనేమోలెండి.... ఆయన తత్వమే డ్రిల్లుమయం. పగలు వాళ్ళనీ, రాత్రులు నన్నూ, డ్రిల్లు చేయిస్తారు. అంతేకాని ఏ సరసమూలేదు, రసికత్వమూ లేదు....ఎప్పుడూ ఒకటేరకం.... మార్చి-మార్చి-రైట్, లెఫ్ట్...వెధవబతుకు!'' అని.

మామూలు సొద చెపుతోంది. ఈ దీనచరిత్ర మామూలేననీ, నా భార్యకే కొంచం ఆలోచించుకునే తెలివివుంటే, ఆ డ్రిల్లు మినహాతక్కినదంతా యిలాంటి చరిత్రనే చెప్పివుండవొచ్చుననీ; ఉదయించిన సూర్యుడు అస్తమించడం ఎంత సహజమో, సంసారంలో మోహం చల్లారడం అంత సహజమనీ-తెలుసుకునే యిష్టంలేదు. ఆమె మాటలు వింటున్నాయా చెవులు, యింగ్లీషులో దీనంగా పలుకుతున్న ఆమె కంఠపు మాధుర్యాన్ని వింటున్నాయి గాని!

"ఇలా యే రసికత్వమూ ఆనందమూ లేకుండా ఎన్నాళ్ళని యెందుకు బతకను? ప్రతియేటా యీ పిల్లలు ఒక గోల! మాలో సాధారణంగా ఇంతమంది పిల్లలు వుండరు. నేను యీ గర్భాలు మొయ్యడం, కనడానికి బాధపడడం, పిల్లలతో క్షోభపడడం సార్జంటు గారికి ఓ ఆనందం....ఇలానే ముసలిదాన్ని అయి, సమాధి చేరుకుంటాను.''

యేడ్చింది. నేనింక భరించలేక, లేచి ఆమె తలని కావిలించుకుని-

చప్పునలేచి దూరంగా వెళ్ళింది.

"మొగవాళ్ళందరూ యింతే. ఏదో నమ్మి, స్నేహంగా మాట్లాడితే, అదంతా ప్రేమ అనుకుని యిట్లా సముదాయింపు ప్రారంభిస్తారు. ఒకరు నన్నిట్లా చేశారు చాలదూ? సిగ్గులేక మళ్ళా ప్రారంభమా? అట్లా కూచోండి, జీవితం ఎంత భగ్నమైపోతేనేం, నీతిని కూడా భగ్నం చేసుకోనా దానితోబాటు....ఒక్కసారి....'' అని.

నన్ను కూచోబెట్టి కథ ప్రారంభించింది. కాని నేను వినలేదు.

తీగెలోంచి ఆమె మీదపడి భుజంనుంచి మెడమీదికి పాకే వెన్నెల వెలుతురిలో ఆమెని చూస్తో, మరీమరీ బలవంత పెట్టి ప్రేమభిక్ష పెట్టమని అడుగుతున్నాను.

ఆ ఆఖరు ఆటంకం దాటడానికి జంకుతో, కొత్తపెళ్ళికూతురుపడె సహజమైన సిగ్గుతో, జవాబునిగాని, పెదిమల్నిగాని, నా కందనీక, మధురంగా తిప్పలు పెడుతోంది. అతను రాగానే లేచాము. వాళ్ళిద్దరూ నాతో కొంతదూరం గేటుదాకా వస్తామన్నారు. ఆయన ముందూ, తరవాత నేనూ, నా వెనక ఆమే మెట్లు దిగుతున్నాము. ఇంతసేపూ నన్ను

తిప్పలుపెట్టినదల్లా, చప్పున వరండా మీదనించి నా మెడచుట్టూ చేతులేసి, నా తలని తన రొమ్ముకేసి వెనక్కి వొంచి, వొంగి పెదిమలమీద చప్పుడు కాకుండా ముద్దుపెట్టుకుంది. ఉలిక్కిపడి ముందుకి చూశాను భయంతో. తల వొంచుకుని నడుస్తోనే వున్నాడు ఆ 'డ్రిల్లు' మానవుడు.

ఆ రోజునించి ప్రతి మధ్యాహ్నమూ నా మూలాన ఆ గౌను చిరుగు పెద్దదవుతోంది. ఆ చిరుగుతోపాటు నా హృదయం ఎక్కువ పెద్ద దవుతోంది. నాభావన కోర్కెలకు బలమిస్తోంది. 'క్యూరియాసిటీ', కొత్తదనమూ, స్త్రీలో వింతదనమూ, ఆచారభేదమూ యివన్నీ ఆకర్షణకి దోహదం చేశాయి. ఇప్పుడు విచారాలు, చిన్న యేడుపులూ, మాటలు కూడా తక్కువే చూపులూ, నవ్వులూ, జ్ఞాపకాలూ, ఆశలూ ఎక్కువైనాయి. కాని యెంత తిప్పలు పెడతారు. మనిషినెంత యేడిపించి, హేళనచేసి, విసికిస్తారు. అలాంటి భర్తే యింటోవుంటే బతుకు దుర్భరమౌతుంది. ప్రతిపనీ, మాటా, వేషమూ ప్రతినిమిషమూ జాగర్త మీదనే వుండాలి. ఏ నిమిషాన కోపమో, అసహ్యమో కలిగిస్తామని భయం. ఏ పనిని హేళనకింద చూచి నవ్వుతుందో అని సందేహం! అందువల్లనే తెలివిగల పూర్వులు మనదేశ స్త్రీలకి విద్యలేకండా చేశారు.

చివరికి ఎట్లానైతేనేం ఒక మధ్యాహ్నం, మర్నాడు తెల్లారకట్ట ఆమె నన్ను ఎక్స్‌పెక్ట్ చేసేట్టు వొప్పించాను.

సింహబలుడు రాత్రి యెప్పుడవుతుందా అని, పడ్డవేదన నేను తెల్లారాలని పడ్డాను. నేను చూసిన తెలుపుని తల్చుకుని, చూడనిదాన్ని భావించుకుని, నిద్రపోలేక పోయినాను. చివరికి యెప్పుడో నిద్రపోయి లేచేప్పటికి తెల్లవారి ఏడుగంటలయింది. ఎంత నిరాశ కలిగింది! నన్ను నేను తన్నుకున్నాను కరుచుకున్నాను.

ఎలా గడిపానో కాలం మర్నాటిదాకా! నా నిరాశ సరే! పాపం నాకోసం ఎదురుచూసి, ఎంత ఖేదపడ్డాదో ఆమె! మధ్యాహ్నం లోపలికి వెళ్ళగానే. ఆమె చేతులు పట్టుకొని, కుర్చీముందు మోకరించి (అలా దొరలు చేస్తారని నవలలో చదివాను.)

"క్షమించు, క్షమించు" అన్నాను.

ఆమె నా మొహం, నా వాలకం చూసి, నేనేదో ఆపదలో వొచ్చి, "రక్షించు, రక్షించు" మంటున్నా ననుకుందిట!

"యేమిటి? యేమిటి?" అంది.

మే మీ గోలలో వుండగా లోపల్నించి సార్జంటు వొచ్చాడు. నా గుండెలు చప్పున ఆగాయి. చచ్చాననుకున్నాను.

"ఏమిటిది?"

దవడలు రెండూ గట్టిగా బిగుసుకున్నాయి. నాలిక అంగుట్లో వుండకట్టింది. కాళ్ళు వాటంతట అవే భయగీతానికి తాళ మేస్తున్నాయి. ఆ వొణుకుతో చావకపోతే, దొర రివాల్వర్ దెబ్బతో ఆఖరనుకున్నాను. ఆ.....ఆమె మాట్లాడుతోంది.

"ఊ-తరువాత-యేమయింది? అతన్ని లేవతీసిందీ?..... ఇలానేనా?" అంటో ఆమె నన్ను లేవతీస్తోంది. ఇంకా అంటోంది.

"చాల్లెండి ఇంక ఆ మొహం మార్చండి యీ పాటికి. అతనేమన్నాడు-అప్పుడు?"

ధైర్యం లేనివాళ్ళకి బుద్ధి చాలా చురుకైనది వుంటుంది. అంతేకాక ములక్కాడలూ, బెండకాయలూ తిని, మెదడుకి భాస్వరం ఎక్కించి తెలివి నభివృద్ధి చేసుకున్నానుకూడా. తర్కవేదాంతాలకి పశ్చిమఖండాల్లో కూడా ప్రసిద్ధికెక్కిన బ్రాహ్మణ జన్మ-యీనాటికి యిలా అయిందిగాని! చప్పునఆమె ధోరణినికని పెట్టి, అర్థంచేసుకుని, "బతికించిందిరా బాబూ" అని కృతజ్ఞతని ఫీల్ అవుతో నా మొహంమార్చి, వెనక్కి అంగవేసి "చూసుకో నా ప్రతాపం అని అన్నా"డని మీసం తిప్పి, నాటకం పూర్తిచేశాను.

"చూడు జాన్, ఎంత బాగా అనుకరించగలడో. మనుష్యుల్ని !"

"ఈవాళ పొద్దున్న కోమటింటో చూశా, ఈ నాటకమంతా" అన్నాను, నాకన్న ధైర్యానికి ప్రసిద్ధికెక్కిన జాతిమీద పాపమంతా తోసి.

ఆమె గుక్క తిప్పుకోకుండా నవ్వుతోంది.

అతనూ, "ఏదీ మళ్ళీచూపు" అంటో,

నవ్వుతున్నాడు. బతుకుజీవుడా అని, నే నూవొకటే నవ్వు. నవ్వులతో నిండిపోయింది ఆ బంగళా. దడిమీద తెల్లని పూలు మమ్మల్ని చూస్తో తలాడించి పకపకా నవ్వాయి. గుమ్మంలో కట్టేసిన సింహమంతటి కుక్క ముందు కాళ్ళెత్తి "బొయ్యి, బొయ్యి" మంది, ఆనందాన్ని తానూ పంచుకోవాలనే ప్రయత్నంలో.

దొర, టోపి పెట్టుకుని, మీసాలు మెలేసి, చిన్న బెత్తం ఆడించుకుంటో వెళ్ళిపోయినాడు.

"అమ్మయ్యా? ఇప్పుడు చెప్పండి? ఏమిటది?"

"ఏమిటి?"

"తెల్లబోయి చూస్తారేం? ఏ మెరగనట్లు? ఆ కాళ్ళమీద పడడం?"

"తెల్లారికట్ట రానందుకు!"

"రానందుకు,"

"క్షమించమని!"

"ఐతే?"

"క్షమార్పణ అడుగుతున్నాను."

"ఆ కాళ్ళమీద పడడం...."

"మరి అట్లానేకాదూ "లేడీ"లను అడగవలసింది?"

పట్టలేక నవ్వింది, కోపం రాలేదుకద!

వెక్కిరిస్తే వెక్కిరించింది. మూడుసార్లు నన్ననుకరించి విరగబడి నవ్వింది.

"కోపం రాలేదుకద? ఎంతో భయపడ్డాను."

"ఎందుకు?"

"నాకు మెళుకువ రానందుకు."

"ఏం చేస్తారు? రేపు, ఏం?"

మర్నాడు తెల్లవారకట్టేలేచి సార్జెంటు డ్రిల్లుకు వెళ్ళటం కంచెవెనకనించి, కనిపెట్టి, మళ్ళీ దేనికన్నా వస్తాడేమోనని, పదినిమిషాలు నిదానించి, ఆ పది నిమిషాలు వృధాచేకున్నందుకు దిగులుపడుతూ, నడిచాను. చాలా వుత్సాహంతో, సంతోషంతో నా హృదయం సంగీతం పాడింది. దడిమీద తెల్లనిపూలు మంచుబొట్లతో మెరుస్తూ నన్నుచూచి ఆహ్లాదంగా తలలు ఆడించాయి. గుమ్మంలోకి రాగానే, వాళ్ళ పెద్ద వేటకుక్క తోకాడించి నా చేయి నాకింది. తలుపు తోసుకుని ఆనందంతో ఎక్సైట్మెంట్‌తో వొణుకుతూ వున్న కాళ్ళతో గదిలో పక్కదగ్గిరికి వెళ్ళాను. ఇంకా లేవకుండా నాకోసం ఎదురుచూస్తో పడుకొనివున్న ఆమె నన్ను చూడగానే సిగ్గుతో దిండులో తల దాచుకొని, నా హృదయం మోహంతో వుడుకెత్తించింది, దగ్గరకు వెళ్ళాను. ఆ చిరుగుల గౌను మాయమయింది. పల్చని పట్టు బెడ్రెస్సుతో వుంది. ఆ తెలుపు, యీ పట్టుక్రేపు గులాబి కలసి ఎంతో మనోహరంగా కనబడుతోంది. వొళ్ళు నున్నని, మెత్తని గట్టి చర్మంమీద ఆ పలుచని పట్టు అతుక్కొని జారిపోయింది. చెయ్యి చెంపకిందవేసి, ఆమె మొహం నాకేసి తిప్పుకున్నాను. దొంగచూపుపెట్టి కళ్ళు తిప్పుకుంది. ఎర్రని పెదవులు నవ్వుతున్నాయి. కాలం వృధాచేసుకుంటున్నాని జ్ఞాపకం వచ్చింది. అతను లేచినచోట పక్క ఇంకా గుంటగా వుంది. పడుకోవాలని చెయ్యి పెట్టినపుడు, ఇంకా వెచ్చగావుంది. ఆ స్థలాన్ని ఆక్రమించుకొని ఆమె గౌనుని ఆత్రుతతో తొందరగా గబగబలాగేశాను. ఎట్లాగయితే అట్లాసాలీడు దారాలవలె నా వ్రేళ్ళవెంబడి వూడిపోయి జారివచ్చింది సుఖంగా. గుచ్చుకునే పిన్నులు, వూడిరాని ముడులు ఏమీలేవూ! ఎట్లా ఐనా తెల్లవాడు వీలుచూచి కనిపెట్టిన బట్టలయ్యేను? నా కళ్ళ కరువు దీర్చుకొని, నా వాంఛ తలకెక్కి, నేను కదిలేటప్పటికి మంచము క్రిరుమంది. పక్కతొట్టిలో పడుకొన్న 'బేబీ' లేచాడు.

"ఒక్క నిమిషం వుండండి" అని,

లేచివెళ్ళి, తొట్టి ఊపింది. వస్త్రము లేకుండా నుంచున్నప్పటి ఆమెని, ఆమె పిరుదుల గుండ్రతనాన్ని నడుందగ్గిర ఆ జవజవని చూసి ఆగలేక వెనుక నుంచుని ముందుకు చేతులు చేతులు పోనిచ్చి, ఆమె నడుముకొన్నాను. తెల్లగా మెరిసే ఆమెమీద నల్లని చేతులని చూచి, తన తల్లిని పట్టుకొన్నది సైతాను అనుకొన్నాడో, యమకింకరు డనుకొన్నాడో, ఆ 'బేబీ' కెవ్వుమన్నాడు. ఆ పెద్ద కేకవిని, నాకు సార్జెంటు, పోలీసుదళము అందరు పరుగెత్తుకొని వచ్చినంత భయం పుట్టింది. ఆలోచించడానికన్నా వ్యవధిలేదు. అందరూవచ్చి గుమిగూడి నట్లు తోచి దోడ్లోనించి పారిపోవాలనే ఉద్దేశంతో వెనక గదిలోకి పరిగెత్తి దొడ్డితలుపు లాగాను. కాని అది రాలేదు. నిరాశపడి, చావు తప్పదని నిశ్చయించుకొని, వొణుకుతో నీళ్ళతొట్టి మూల నక్కుకున్నాను. సార్జెంటు వస్తున్న చప్పుడుకూడా విన్నట్టయింది. భద్రయ్య నాకు బాకీ వున్న సొమ్ము, సాక్షెలెవ్వరు లేకపోవడం, ఆ కాగితాలు ప్లీడరుదగ్గర వుండడం, జ్ఞాపకం వచ్చాయి. ఎందుకో, చావుముందు చదువుకోవాలని వల్లెవేసి పట్టుకున్న జపాక్షరాలు ఉచ్చరించుకుంటున్నాను. అడుగులచప్పుడు....వొస్తున్నాడు. వెంటనే రివాల్వరుతో చంపుతాడా? లేక ముందు చిత్రవధ చేస్తాడా?

---కాదు.

..........ఆమె!

"ఏమిటండీ? ఇక్కడ దాక్కున్నారు? బేబీ పడుకున్నాడు, రండి" వస్త్రములులేని ఆమె అందం చూడలేదు. ప్రేమ వొలికే ఆమె కాళ్ళ మృదుత్వాన్ని చూడలేదు. వెళ్ళి పడుకున్నాను. కాని నేను వచ్చినాలుగు గంటలయినట్లు తోచింది. "డ్రిల్" అయిపోయి సార్జెంటు వస్తూ వుంటా డీపాటికి.

"రేపు వొస్తాను."

రెండుచేతులతో నన్ను దగ్గరకు వొత్తుకొని, "ఇప్పుడే" అంది.

కాని నా భయం ఏమని చెప్పను నా వొళ్ళంతా వణుకుతూవుంది. మోకాళ్ళు కొట్టు కుంటున్నాయి. ఆ భయంతో నా రోమాన్సు, మతి, దేహంలో శక్తి, కామం అన్నీ చచ్చాయి. తను రాకుండగానే, చంపాడు సార్జెంటు నన్ను. కాని కొంచెం వ్యవధి వుండదా? ఆమె ఇంత ధైర్యంగా వుందే, అనుకొని చూశాను. కాని లాభంలేదు. ఎక్కడా, ఏమూలా, ఉత్సాహమూ, ధైర్యమూ లేదు. నోరు తడి ఆరిపోయింది. ఎంతసేపన్నట్టు నావంక జాలిగా చూసింది. ఆ చూపుతో నా గుండె కరిగిపోయింది. మదన కామేశ్వరీ మాత్రలు, ఊరపిచ్చుక లేహ్యం, బీజబందూ తలుచుకొన్నాను. రాధికా స్వాంతనములో శుద్ధప్రతిలో లోపించిన పద్యాలు చదువుకొన్నాను. ఆ ఊర్వశీ, మోహినీ పటాలు, పారిస్ పిక్చర్ కార్డులు ధ్యానించుకొన్నాను. కానీ, ఆ ఊర్వశీ పటంలో పురూరవుడికి సార్జంటు మీసాలు వున్నాయి.

బృహస్పతి చేతిలో రివాల్వరు, మోహినికి పెద్ద బూడ్సులు....నీలపు కనుపాపల్ని విప్పి విచారంతో నా అవస్త చూస్తూ పడుకొంది. మళ్ళీ నాలో జాలి, సిగ్గు కలిగింది. మనస్సు గట్టిపరచుకొన్నాను.

కాని ఆ చప్పుడేమిటి?

బూడ్సులు.

తలపులోనుంచి తళతళమనే దేంటి?

రివాల్వరు.

"రేపు" అని, లేచి పంచ చేతులో పట్టుకొన్నాను.

ఆమె, లేచి తలుపులోనుంచి నన్ను ఒక్కతోపు తోసి బయటకి నెట్టి,

"ఇంకా మాఇంటి వైపురా, చెపుతా నపుంసకుడా!" అంది.

ఈ చప్పుడువిని నిద్రపోతూన్న పెద్ద వేటకుక్క అరిచి నామీదపడింది. చలిలో వణుకుతూ చొక్కా చంక కింద పెట్టుకొని రోడ్డుమీద పడ్డాను. కంచమీద తెల్లని పువ్వులు పకపక నవ్వాయి.

◆ ◆ ◆

*ప్రచురణ : (అదృష్టం కథల సంపుటి) ప్రేమచంద్ పబ్లికేషన్సు, గ్రంథ పునర్ముద్రణ, 1964*